## క్లుప్తంగా

### నివాళి



రాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్

**ఐరాల:** మండలంలోని ఎర్రేపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, బంగారుపాళెం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ పరామర్శించారు. ఆదివారం ప్రభాకర్‌రెడ్డి సతీమణి రాణి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆమె చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

### నెమలి వాహనంపై సుబ్రమణ్యేశ్వరుడు



నెమలి వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

**తవణంపల్లె:** మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు ఆలయ ధర్మకర్త ఎగువ తవణంపల్లె దామోదర్ రెడ్డి నేతృత్వంలో ఆడికృత్తిక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. శనివారం భక్తులు స్వామికి భరణి కావళ్లు చెల్లించారు. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా భక్తులు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రిలో సుగంధపరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకిలో నెమలి వాహనంపై శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి కొలువుదీరి పురవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యమిచ్చారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

### తప్పిపోయిన పిల్లల అప్పగింత



పిల్లలను అప్పగిస్తున్న పోలీసులు

**చిత్తూరు అర్బన్:** పార్కు సమీపంలో తప్పిపోయిన ఇద్దరు పిల్లలను పోలీసులు కుటుంబీకులకు అప్పగించిన సంఘటన ఆదివారం నగరంలో వెలుగు చూసింది. వివరాలోకి వెళ్తే.. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన ధనరాజ్ తన ఇద్దరు పిల్లలు యస్మిత, తనుశ్రీని ఆదివారం సాయంత్రం ఆడుకోవడానికి డీఆర్ పార్కుకు తీసుకొచ్చారు. ఈక్రమంలో ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. డీఆర్ పార్కు సమీపంలో ఈ ఇద్దరు పిల్లలు ఏడుస్తూ కట్టమంచికి చెందిన భరత్‌రాజ్, గుణశ్రీ కంటపడ్డారు. వారు వెంటనే పిల్లలను పోలీసులకు అప్పగించారు. తర్వాత పోలీసులు వివరాలు సేకరించి.. నానమ్మ ఇంద్రాణికి అప్పగించారు. పిల్లలను అప్పగించిన వారిని వన్‌టౌన్ సీఐ మహేశ్వర అభినందించారు.

### ముగిసిన నృత్యపోటీలు



నాట్యం చేస్తున్న విద్యార్థులు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. పలు పాఠశాల విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యంతో ఆహుతులను అలరించారు. అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు రాజరత్నంరెడ్డి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.

### 22న మామిడి దినోత్సవం

**బంగారుపాళెం:** మామిడి దినోత్సవాన్ని రైతులు జయప్రదం చేయాలని మామిడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేది చిత్తూరులోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడి రైతు మహాజన సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమైతుందన్నారు. రైతులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

# బాబు పాలన..అంతా నయవంచన

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్
- నగరంలోని 1, 2, 3, 50 డివిజన్లలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం
- సమస్యలను ఏకరవు పెట్టిన స్థానికులు
- కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు



చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్, కేపీ శ్రీధర్, జ్ఞానజగదీష్ నాయకులు

**చిత్తూరు కార్పొరేషన్:** చంద్రబాబు ష్యూరిటీ..దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలకు గ్యారెంటీగా మారిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఎద్దేవా చేశారు. నగరంలోని 1వ డివిజన్ మురకంబట్టు అగ్రహారంలో నాయకులు సత్య, 2వ డివిజన్ మురకంబట్టులో కుట్టి, 3వ డివిజన్ దొడ్డిపల్లెలో శివ, లోక, 50వ డివిజన్ చవటపల్లెలో మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయానంద రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాపక్షమేనని తెలిపారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. రూ.వెయ్యి పింఛన్ పెంచి, 5 లక్షల మంది పేదల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. సొంత నిధులతో తాను దొడ్డిపల్లెలోని పలు అమ్మవారి ఆలయాల్లోని విగ్రహాలకు కానుకగా బంగారు గొలుసులు అందజేసిన విషయం గుర్తు చేశారు. అలాగే రోడ్డు వేయించానని, కార్తీకదీప మహోత్సవాలకు తన వంతుగా సాయం చేసిన విషయం గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు.



విజయానందరెడ్డికి సమస్యలను ఏకరువు పెడుతున్న స్థానికులు



పాల్గొన్న స్థానికులు

**హామీలను అమలు చేయాలి..**

అనంతరం డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేశాయన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచే పుట్టిందని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బులు ఉన్నవారు లేనివారికి సాయం చేయాలని పీ–4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, లక్షల కోట్లు ఉన్న చంద్రబాబు ఎంతమందిని దత్తత తీసుకోవాలో ప్రజలే ఆలోచించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంటింటికీ వచ్చి ప్రజలకు జరగాల్సిన మేలును స్థానిక నాయకులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, గుడిపాల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు మధురెడ్డి, మురళీరెడ్డి, అన్బు, చల్లా ముత్తు, శేఖర్, దేవరాజులు, మనోజ్, రాజశేఖర్, ప్రసాద్, రమణ, కేశవరెడ్డి, ధన, బావజాన్, గోపి, మురళీ, అరుణ్, పవన్, నవీన్, ధనరాజ్, గౌతమ్, గణేష్, తిలక్, ప్రకాష్, కుమార్‌వేల్, వేలవన్, ఆర్ముగం, జయగణేష్, మురుగేషన్, వినాయకం, వెంకట్‌ప్రకాష్, ఏలుమైల పాల్గొన్నారు.

**ఖాకీల ఆంక్షలు**

నగరంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమానికి పోలీసులు పలు ఆంక్షలు పెట్టడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు దుయ్యబట్టారు. అనుమతుల తీసుకోలేదనే సాకుతో టపాసులు కాల్చరాదని.. మైక్ వాడరాదని.. ఇంతమంది ఎందుకు వచ్చారు ? అని ప్రశ్నించడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మురకంబట్టు, చవటపల్లెలో స్టేజీలు వేయకూడదని అభ్యంతరం చెప్పడం సరికాదని విమర్శించారు. అధికార పార్టీ కార్యక్రమాలకు లేని నిబంధనలు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకే ఎందుకని విమర్శించారు.

**సమస్యలను ఏకరవు పెట్టిన స్థానికులు**

మురకంబట్టులో స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా ఫలితం లేదని స్థానికులు సమస్యలను ఏకరవు పెట్టారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తీర్చాలని వినతి చేస్తే అధికార పార్టీ నేతలు చులకనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిదీపాలు వెలగడం లేదని.. రోడ్లలో గుంతలు ఏర్పడ్డాయన్నారు. కొళాయి కనెక్షన్స్ ఇవ్వడం లేదని వాపోయారు. పిల్లల తల్లిదండ్రులు వ్యతిరేకించిన అగ్రహారంలోని పాఠశాలను రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న మురకంబట్టు పాఠశాలలో విలీనం చేశారని బాధను తెలియజేశారు. చిన్నపిల్లలు సైతం తమ స్కూల్‌ను మార్చడంపై సమస్య తెలిపారు. మురకంబట్టు, చవటపల్లె, దొడ్డిపల్లెలో కూటమి నేతలను నమ్మి ఓట్లు వేసినందుకు బుద్ధి వచ్చిందని స్థానికులు తెలిపారు. సూపర్‌సిక్స్ హామీలను అమలను మరిచిపోయారని ఎద్దేవా చేశారు.

# మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

**ఐరాల:** వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని, కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని వారపు సంత వద్ద ఆయన మండల పార్టీ నేతలతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో ఎంపీ అరెస్టుపై నిరసన చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి చంద్రబాబు, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించి వైఎస్సార్‌సీపీ నేతల అక్రమ అరెస్టులు, హత్యారాజకీయాలు, కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని మండిపడ్డారు. వ్యక్తిగత కక్షతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# కూటమి ప్రభుత్వానివి చీప్ పాలిటిక్స్

- వైఎస్సార్‌సీపీ నేతలను ఎదుర్కోలేక ఇలా అక్రమ అరెస్టులకు పాల్పడుతోంది
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని సీఎం చంద్రబాబు టార్గెట్ చేశారు
- అక్రమ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్



**చిత్తూరు కార్పొరేషన్/ఐరాల:** వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం పలువురు నేతలు స్పందించారు. కూటమి ప్రభుత్వం కేసుల పేరిట వైఎస్సార్‌సీపీ నేతలపై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. సమయం వచ్చినప్పుడు కూటమి ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎన్ని కష్టాలు పెట్టిన వారిలో ఎటువంటి మార్పు ఉండదన్నారు. పార్టీ మొత్తం వారికి మద్దతుగా ఉంటుందన్నారు. సమయం వచ్చినప్పుడు నిజాలు బయటకు వస్తుందన్నారు.

**మిథున్ రెడ్డి అరెస్ట్ అనాగరికం**



**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** లోక్‌సభ ప్రతిపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై అక్రమ కేసును సృష్టించడం రాజకీయ ప్రతి కారంతోనే. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ ప్రజాస్వామ్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ప్రజా ప్రతినిధులను అరెస్టులు చేయడం మాని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులను అరెస్ట్ చేస్తే నిజానిజాలు కూటమి ప్రభుత్వానికి తెలుస్తుంది. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలి. వైఎస్సార్‌సీపీ నేతలపై ఎన్ని కేసులు పెట్టినా, పలు ఇబ్బందులకు గురి చేసినా న్యాయస్థానంపై నమ్మకంతో ధైర్యంగా ఉంటారు. మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు అనాగరిక చర్య.

-మర్రిపూడి దేవేంద్రరావు,
భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు

**ఎంపీ అరెస్టు ఆటవికం**

**చిత్తూరు కార్పొరేషన్:** కూటమి అరాచక పాలనలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు ఆటవిక చర్య అని రాష్ట్రీయ వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మిపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలసుందరం, నగర అధ్యక్షుడు శరవణకుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కూటమి పాలకులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కేంద్రం పర్యవేక్షించాల్సి ఉందన్నారు. ఓటమి ఎరగని నేతగా ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిపై అక్రమకేసులు నిలబడవని పేర్కొన్నారు.

**అక్రమ కేసులో ఇరికించే ప్రయత్నం**



అక్రమ కేసులో మిథున్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం జరుగుతోంది. సీఎం చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలతోనే సాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడంతోనే వైఎస్సార్‌సీపీలోని కీలక నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తున్నారు. వ్యక్తిగతంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేశారని, రాజకీయంగా ఎదుర్కోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు పెట్టారు. మదనపల్లె ఆర్డీఓ ఆఫీసు అగ్ని ప్రమాదంలో పెద్దిరెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. కానీ దాన్ని నిరూపణ చేయలేకపోయిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

- చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్

**ముమ్మాటికీ రాజకీయ కుట్రే..**



వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ, ఉమ్మడి అనంతపురం జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం ముమ్మాటికీ చంద్రబాబు, లోకేష్ రాజకీయ కుట్రలో భాగం. లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టారు. ఇప్పుడు కూటమి నేతలు తాత్కాలికంగా రాక్షసానందం పొందవచ్చేమే గానీ, కోర్టులో ఈ కేసు నిలబడదు. అక్రమంగా అరెస్ట్ అయిన ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు రావాలని మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశాను.

- శైలజారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకురాలు

**బాబు మద్యం స్కాంలో దొరికారు..**



గత పాలనలో మద్యం స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. అలాంటి బాబు అధికారంలో రాగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన వారిపై కేసులు పెట్టిస్తున్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక బెల్టు షాపు లేదని, ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం షాపులు నిర్వహించింది. కానీ నేడు ఏ గ్రామంలో చూసిన బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయి. రాజకీయ కుట్రలో భాగంగా లిక్కర్ కేసులో ఇరికించారు. ఈ కుట్రలకు మిథున్‌రెడ్డి భయపడే వ్యక్తి కాదు. వారికి పార్టీ క్యాడర్ ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుంది.

- జ్ఞానజగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు, మొదలియార్ విభాగం

**ప్రతిపక్షం లేకుండా ప్లాన్**



రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అందుకే వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిపై కక్షకట్టారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని మానసికంగా కుంగదీయాలనే ఉద్దేశంతో ఇలా చేశారు. జగనన్నకు ఆప్తులు అయిన మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి కుట్రబుద్ధి చూపెడుతోంది. రెడ్‌బుక్ పాలనలో హామీలు గాలికొదిలి ప్రజాసంక్షేమాన్ని విస్మరించారు. అక్రమ కేసులు, అరెస్టులే లక్ష్యంగా చేసి అడ్డుకోవడం సరికాదు.

- లీనారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళ విభాగం

# మొగిలి శివాలయంలో పారిశుద్ధ్య పనులు







మొగిలిశివాలయంలో ధ్వజస్తంభాన్ని, కోనేరు ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేస్తున్న భక్తులు, ఆలయ ఆవరణలో తమిళనాడుకు చెందిన శివభక్తులు

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలిశివాలయంలో ఆదివారం తమిళనాడుకు చెందిన శివభక్తులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తమిళనాడులోని వేలూరు, గుడియాత్తంలోని ‘అప్పర్ సన్మార్గ ఉయవార్‌పణి అరికట్టలై’ అనే సేవాసంఘం శివభక్తులు 80 మంది ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు శుభ్రపరిచారు. కోనేరు ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా శివభక్తులు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా శివాలయాలను పరిశుభ్రం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మండలంలోని మొగిలి శివాలయంలో ఏటా ఫిబ్రవరి, మార్చిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతోందని, అలాంటి సందర్భంగా సంఘం ద్వారా ఆలయంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి సేవలు అందించాలని ఈఓ మునిరాజులు తమిళనాడు శివభక్తుల సంఘాన్ని కోరారు.

### హరో.. హరా..!



కావళ్లతో వెళ్తున్న భక్తులకు పాదపూజ

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా ఆదివారం హరోహరా నామస్మరణలతో మార్మోగాయి. ప్రజలు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం దీక్ష విరమించారు. చాలామంది కులదేవతకు పూజలు చేశారు. కొంతమంది భక్తులు చిత్తూరు నగరంలోని సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్నారు. మరికొంతమంది తమిళనాడులోని తిరుత్తణి, వళ్లిమలైలోని సుబ్రమణ్యస్వామిని తరించి దీక్ష విడిచారు. పలువురు కావళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. పలు ప్రాంతాలు కావళ్లతో వేల్ హరోహరా నామస్మరణలతో మార్మోగాయి.

### నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

**ఐరాల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు, కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

### నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

### యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



గుడిపాల: వసంతాపురం సమీపంలో అక్రమంగా కలపను తరలిస్తున్న దృశ్యం

**గుడిపాల:** మండలంలో కలప అక్రమ రవాణాకు అడ్డు అదుపూ లేకుండా పోతుంది. పగలే ఎటుచూసినా ట్రాక్టర్ల ద్వారా రోడ్లపైన తరలిపోతోంది. రాత్రి వేళల్లో తమిళనాడు ప్రాంతానికి యథేచ్ఛగా తరలిస్తున్నారు. కలపను కొట్టి అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వృక్షసంపద మాయమవుతోంది.

**అధికంగా తమిళనాడుకే..**

గుడిపాల మండలంలో ఎక్కువగా అటవీప్రాంతాలు ఉన్నాయి. ఈ అటవీప్రాంతం కూడా తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉంది. కొంతమంది స్మగ్లర్లు యథేచ్ఛగా రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలోని పెద్దపెద్ద చెట్లను నరికివేస్తున్నారు. మరికొంత మంది రైతుల పొలాల్లో కొని వ్యాపారం చేస్తున్నారు. గుడిపాలలో ఉన్న కలపను అంతా తమిళనాడుకు తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు.



ఏఎల్‌పురం వద్ద కలపను ట్రాక్టర్‌లో అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న దృశ్యం